సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 27 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.34 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34 వేలు, కనిష్టంగా రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.36

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.36, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.28 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

30.1°/15.3°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఎండుమిర్చి @ రూ.18,500



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు 144 మంది రైతులు 159.20 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకువచ్చారు. మొదటి రకం మిర్చి క్వింటా రూ.18,500, రెండో రకం క్వింటా రూ.9 వేలు, మూడో రకం ఎండు మిర్చి క్వింటా రూ.7 వేల మేర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. తుపాను ప్రభావంతో ఎండుమిర్చి నాణ్యత అంతంతమాత్రంగా ఉందని ఆయన వెల్లడించారు.

నేడు స్క్రీనింగ్ టెస్ట్

అనంతపురం రూరల్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10.30 గంటల్లోపు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 08554-275575, 7799043773 నంబర్లను సంప్రదించాలన్నారు.

'ఆప్టా' జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

పుట్టపర్తి టౌన్: ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా నూతన వర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక ఆప్టా జిల్లా కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రావ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా చిరంజీవి, అధ్యక్షునిగా వెంకటనాయుడు, ప్రధాన కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, అదనపు ప్రధానకార్యదర్శిగా అంజనమూర్తి, ఆర్థిక కార్యదర్శిగా శివ సంపత్‌కుమార్‌తో పాటు జిల్లా కార్యదర్శులుగా ఐదుగురిని, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా ఏడుగురిని ఎన్నుకున్నారు. అలాగే ఎర్రిస్వామి, ప్రసాద్, ఉదయభాస్కర్‌రెడ్డి, శమంతకమణిని రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి విద్యార్థులకు వైద్య పరీక్షలు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం నుంచి హెల్త్ స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుని విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్స్ మీటింగ్ ఉంటుందని ఆ రోజునాటికి విద్యార్థులందరికీ పరీక్షలు చేయించాలన్నారు.

అనుచిత పోస్టులపై చర్యలు తీసుకోండి

- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన ఉషశ్రీచరణ్



డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేస్తున్న ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన టీడీపీ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆమె పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లును కలిసి ఫిర్యాదు చేశారు. వ్యక్తిత్వ హననానికి పూనుకున్న టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి పార్టీల నాయకులు అక్రమంగా కేసులు పెడుతున్నారని, పోలీసులు వాస్తవాలను గమనించి చర్యలు తీసుకోవాలన్నారు. ఉషశ్రీచరణ్ వెంట వైఎస్సార్ సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు సుధాకర్‌రెడ్డి, నరసింహులు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి కుట్రలు.. ఆశలపై నీళ్లు

రెండు నియోజకవర్గాలు, ఐదు మండలాల తాగు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే జిల్లేడుబండ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించాక..కూటమి ప్రభుత్వం అంతా తూచ్ అంటూ వెనక్కు తగ్గుతోంది. రైతుల ఆశలపై నీళ్లు పోస్తూ... అసలు ప్రాజెక్టు కట్టాలా... వద్దా.. అంటూ మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

ఇది అర్థం లేని ప్రాజెక్టు



ఇటీవల జిల్లేడుబండ వద్ద రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

నాకు రాష్ట్రంలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన ఉంది. కానీ జిల్లేడుబండ గురించి తెలీదు. నేను ఎన్నికల ప్రచారంలో వచ్చినప్పుడు ప్రాజెక్టును చూడలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు చూస్తుంటే...చాలా అశ్చర్యమేస్తుంది. 8 కి.మీ ప్రాజెక్టును నేను ఎక్కడా చూడలేదు. కేవలం 25 వేల ఎకరాలకు నీరిచ్చే ప్రాజెక్టుకు రూ.680 కోట్లు ఖర్చు చేయాలా...అది అర్థంలేని ప్రాజెక్టు.. చూస్తా సాధ్యాసాధ్యాలు పరిశీలించి అప్పుడు ఆలోచిస్తా.

– ఇటీవల జిల్లేడుబండ ప్రాజెక్టు వద్ద రైతులతో సమావేశమైన మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలివి.

జిల్లేడుబండపై అ'సత్య'ప్రచారం

- సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టుపై కూటమి కుట్ర
- ప్రాజెక్టు కొనసాగించాలా...వద్దా ఆలోచిస్తామన్న మంత్రి సత్యకుమార్
- నిర్వాసితులకు పరిహారం సంగతి తేల్చకుండా డ్రామా
- సర్కారు నాటకంపై భగ్గుమంటున్న రైతులు

ధర్మవరం: జిల్లాలో కీలకమైన జిల్లేడు బండ ప్రాజెక్ట్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. గత వైఎస్ జగన్ సర్కార్ ప్రాజెక్టు టెండర్లు ఖరారు చేసి పనులు ప్రారంభించగా...వాటిని కొనసాగించాల్సిన కూటమి ప్రభుత్వం కుట్రకు తెరతీసింది. ఇటీవల జిల్లేడు బండ ప్రాజెక్ట్ వద్ద రైతులతో సమావేశమైన మంత్రి సత్యకుమార్...పరిహారం మాట పక్కనపెట్టి... ఇది అర్థం లేని ప్రాజెక్టు అంటూ వ్యాఖ్యానించి రైతుల ఆశలపై నీళ్లు పోశారు.

2022లోనే పనులు ప్రారంభం

ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలకు సాగు నీరు, తాగునీరు అందించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ ప్రాజెక్ట్ నిర్మాణానికి సిద్ధమైంది. ఈ క్రమంలో 2020 సెప్టెంబర్‌లో రూ.680 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చి టెండర్లు పిలిచింది. హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్ట్ సంస్థకు టెండర్ ఖరారు కాగా, సదరు సంస్థ 2022లోనే పనులు ప్రారంభించింది. హంద్రీనీవా మెయిన్ కెనాల్ 277వ కిలోమీటర్ వద్ద బుక్కపట్నం మండలం మారాల సమీపంలో రెగ్యులేటర్ ఏర్పాటు చేసి జిల్లేడు బండ ప్రాజెక్ట్‌కు కృష్ణాజలాలను అందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేశారు.

మెరుగైన పరిహారమిచ్చేలా చర్యలు

2.41 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్న జిల్లేడుబండ ప్రాజెక్ట్‌కు సుమారు 7.2 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించాల్సి వస్తోంది. ఇందుకోసం ముదిగుబ్బ మండలంలోని మంగళమడక, చాగాపురం, గుంజేపల్లి, బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామాల పరిధిలో 2,327 ఎకరాల భూమిని సేకరించే విధంగా సర్వే పూర్తి చేశారు. భూనిర్వాసితులకు మెరుగైన పరిహారం అందించేందుకు అప్పటి జగన్ సర్కార్ చర్యలు చేపట్టింది. ఇందుకుగానూ రూ.80 కోట్లు ఎల్‌ఓసీ (లెటర్‌ఆఫ్ క్రెడిట్) ఇస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదనలు పంపింది. అయితే ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే... ఎన్నికలు రావడం.. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం కొలువుదీరడం జరిగిపోయాయి.



ముదిగుబ్బ మండలంలో నిర్మిస్తున్న జిల్లేడుబండ రిజర్వాయర్

ప్రాజెక్ట్ సకాలంలో పూర్తి చేస్తే

జిల్లేడుబండ ప్రాజెక్ట్‌ను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తే ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలకు 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. ఈ రెండు నియోజకవర్గాలకు తాగునీటి ఎద్దడి శాశ్వతంగా నివారించే అవకాశం ఉంది. అంతేకాక పరోక్షంగా బోరుబావుల్లో భూగర్భజలమట్టం పెరిగి వేలాది ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉంది. ఇలా రెండు నియోజకవర్గాల్లోని రైతులకు ఎంతో మేలు చేసే ప్రాజెక్టు గురించి కనీస అవగాహన లేకుండా మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలపై దుమారం

ఇటీవల జిల్లేడుబండ వద్ద మంత్రి సత్యకుమార్, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రైతులతో సమావేశం నిర్వహించారు. దీంతో రైతులంతా పరిహారం గురించి ప్రకటన చేస్తారని ఆశించారు. కానీ వారి ఆశలను అడియాసలు చేస్తూ మంత్రి సత్యకుమార్ వ్యవహరించారు. అసలు జిల్లేడుబండ ప్రాజెక్ట్ ఎంత వరకు ఉపయోగమో విచారిస్తామని, ఎంత మందికి నష్టమో చూసిన తర్వాత కొనసాగించాలో.. లేదో నిర్ణయిస్తామని చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో ప్రాజెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల రైతులు మంత్రి వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నారు. కరువు సీమలో భూగర్భజలాలు పెరగాలన్నా.. సాగు, తాగునీరు పుష్కలంగా అందాలన్నా కొత్త ప్రాజెక్టులు రావాలని, ఆ దిశగా కృషి చేయాల్సిన కూటమి ప్రభుత్వం దాన్ని పక్కన పెట్టి... ఉన్న ప్రాజెక్ట్‌లకు మంగళం పాడితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

రైతుల భూముల జోలికి వెళ్లని వైనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లేడుబండ ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోయే రైతులకు పరిహారం అందించిన తర్వాతే పనులు ప్రారంభించేలా అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇదే విషయం అప్పట్లో ప్రాజెక్ట్ వద్ద రైతులతో సమావేశం నిర్వహించి అధికారుల సమక్షంలోనే చెప్పారు. ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరయ్యేలోపు అప్పటికే ఉన్న ప్రాజెక్టు కట్టలను బలోపేతం చేసే పనులే చేపట్టారు. అప్పట్లో కూటమి పార్టీల నాయకులు నిరంతరం రైతులను రెచ్చగొడుతూ ప్రాజెక్ట్ పనులకు ఆటంకం కల్గిస్తూ ఇబ్బందులకు గురి చేశారు.

రైతు ప్రయోజనాలే ముఖ్యం



జిల్లేడుబండ ప్రాజెక్ట్ వద్ద నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి (ఫైల్)

ఎంత ఖర్చవుతుందన్నది ముఖ్యం కాదు. రైతుకు మేలు జరిగితే చాలు. జిల్లేడుబండ ప్రాజెక్టుతో రెండు నియోజకవర్గాలకు మేలు జరుగుతుంది. తప్పక పనులు చేపడతాం. నిర్వాసితులకు కూడా మెరుగైన పరిహారం ఇచ్చాకే పనులు చేపడతాం. అందుకే ఇప్పుడు ప్రాజెక్టు కట్ట పనులు మాత్రమే చేపట్టాం. మీకు సంతృప్తి చెందేలా పరిహారం అందేకే పనులు చేపడతాం. 25 వేల ఎకరాలకు సాగునీరు, ఐదు మండలాలకు తాగునీటి సమస్య లేకుండా చూస్తాం.

– గతంలో జిల్లేడుబండ వద్ద రైతులతో నిర్వహించిన సమావేశంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి చేసిన వ్యాఖ్యలివి.

2.41 టీఎంసీలు
జిల్లేడుబండ ప్రాజెక్టు సామర్థ్యం

5 ప్రాజెక్టు వల్ల లబ్ధి కలిగే మండలాలు

25 వేల ఎకరాలు
అందుబాటులోకి వచ్చే ఆయకట్టు

రూ.**680** కోట్లు
జిల్లేడుబండ ప్రాజెక్టు అంచనా వ్యయం

త్వరితగతిన పూర్తి చేయాలి



జిల్లేడు బండ ప్రాజెక్టును ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి. ప్రాజెక్ట్ పూర్తయితే ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రాజకీయ కోణంలో చూడకుండా ప్రజా ప్రయోజనార్థం పూర్తి చేయాలి.

–నారాయణ, రైతు, బ్రహ్మదేవరమర్రి గ్రామం, ముదిగుబ్బ మండలం

రాజకీయం చేయడం తగదు



జిల్లేడు బండ ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భజలాలు పెరుగుతాయి. గ్రామాలకు తాగునీరు అందుతుంది. రైతులకు, రైతు కూలీలకు ఉపాధి దొరుకుతుంది. తద్వారా వలసల నివారణ సాధ్యపడుతుంది. ప్రభుత్వం ఈ అంశాన్ని రాజకీయ కోణంలో చూడకుండా సత్వరం పూర్తి చేయాలి. -ధనుంజయరెడ్డి, రాళ్ల అనంతపురం, ముదిగుబ్బ మండలం

మహిళలకు సవిత క్షమాపణ చెప్పాలి

- మహిళలు గంజాయికి బానిసైనట్లు నిరూపించాలి
- లేకపోతే మంత్రి ఇల్లు ముట్టడిస్తాం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: ''వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలు గంజాయికి అలవాటు పడ్డారని మంత్రి సవిత అసెంబ్లీలో చెప్పారు. ఆ మాటలకు కట్టుబడి ఆమె తన సొంత పంచాయతీ రాంపురంలోనే పథకాలు పొందిన లబ్ధిదారుల్లో గంజాయికి ఎవరు బానిసయ్యారో నిరూపించాలి. లేకపోతే తన తప్పు ఒప్పుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు భేషరతుగా క్షమాపణ చెప్పాలి...'' అని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె పెనుకొండలో విలేకరులతో మాట్లాడారు. బాధ్యతగల మంత్రి స్థానంలో ఉన్న సవిత స్థాయికి తగ్గట్టు మాట్లాడటం నేర్చుకోవాలన్నారు. నోరు జాగ్రత్తగా పెట్టుకోకపోతే మహిళా లోకం ఊరుకోదని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీసిందని, ఫలితంగా నిరుపేదల ఇళ్లలో సంతోష కాంతులు కనిపించాయన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని మండిపడ్డారు. ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, మంత్రులు ఏదో గొప్పపని చేసినట్లు నాణ్యమైన మద్యం ఇస్తున్నామని ప్రకటిస్తున్నారని, అలాగే మద్యం షాపులు రిబ్బన్ కట్ చేసి సంతోషపడ్డారన్నారు. అభివృద్ధి అంటే ఇదేనా అని ప్రశ్నించారు. కూటమి నేతల అరాచక చర్యలను చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని, త్వరలోనే గుణపాఠం చెబుతారన్నారు.

మన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. 75వ భారత రాజ్యాంగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజ్యాంగంతో అంబేడ్కర్ ప్రజలకు వాక్ స్వాతంత్ర్యాన్ని కల్పించారని, కానీ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్వేచ్ఛగా మాట్లాడే హక్కును హరిస్తోందన్నారు. ఎవరు ప్రశ్నించినా జైళ్లకు పంపుతూ నియంతృత్వ పాలన సాగిస్తోందన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తూ భయాందోళనలకు గురిచేస్తోందన్నారు. స్వేచ్ఛను హరించే ప్రభుత్వాలు ఎక్కువకాలం మనలేవని, చరిత్ర చూస్తే ఈ విషయం అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పార్టీ పట్టణ కన్వీనర్ బాబు, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాశ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కౌన్సిలర్ శేషాద్రి, సీనియర్ నాయకులు వైశాలి జయశంకర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, దుర్గప్ప, ప్రభాకర్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సౌర విద్యుత్‌పై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



'పీఎం సూర్యఘర్' కార్యక్రమం అమలుపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: సౌర విద్యుత్ వినియోగం, ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. ప్రతి గృహం, కార్యాలయం సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన 'పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' అమలుపై డీఎల్సీ సమావేశం నిర్వహించారు. ఏడాదిలోపు రాష్ట్రంలోని 30 లక్షల ఇళ్లలో సౌరకాంతులు విరజిమ్మాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మోడల్ సోలార్ విలేజ్‌ను ఎంపిక చేయాలన్నారు. ఆ గ్రామంలోని ప్రజలంతా 100 శాతం సోలార్ విద్యుత్‌ను వినియోగించేలా చూడాలన్నారు. ప్రతి సోలార్ గ్రామానికి కేంద్రం రూ.కోటి నిధులు ఇస్తుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా వినియోగదారుడు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలపై మోడల్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి గ్రామీణులకు సౌర విద్యుత్ ఉపయోగాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకట సుబ్బయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికిరణ్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్యతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు,రేపు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ నేటి నుంచి రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ వినోద్ కుమార్ విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. మంగళవారం రాత్రి 10 గంటలైనా షెడ్యూలు రాలేదు. బుధవారం అనంతపురం జిల్లాలో, గురువారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటిస్తారని అధికారులు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులతో మంగళవారం సాయంత్రం కలెక్టర్ వెబెక్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ప్రిన్సిపల్ కార్యదర్శి సమీక్షిస్తారని వెల్లడించారు. ప్రతి మండలం నుంచి ఎంఈఓ-1,2 తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు. కోన శశిధర్ జిల్లాలో వివిధ స్కూళ్లు, జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు పరిశీలించే అవకాశాలున్నాయి. అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ఎఫ్‌ఏ-1, ఎఫ్‌ఏ-2 మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఉండాలని, అన్ని వివరాలు సక్రమంగా ఉన్న విద్యార్థులందరి అపార్ ఐడీ జనరేట్ పూర్తి చేయాలని, ఇతర అంశాల్లోనూ అప్రమత్తంగా ఉండాలంటూ డీఈఓ విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



కలెక్టరేట్‌లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

ప్రశాంతి నిలయం/పుట్టపర్తి టౌన్: రాజ్యాంగ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు కలెక్టర్, ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠిక చదివి వినిపించారు. కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ, దేశంలోని పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులను ప్రసాదించిందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను పాటించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ రత్న మాట్లాడుతూ, భారత రాజ్యాంగం పౌరులు నిత్య జీవితంలో ఎలా నడుచుకోవాలో స్పష్టమైన సూచనలను చేసిందన్నారు. భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సీఐ బాల సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ మహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు తురకలాపట్నం విద్యార్థి



విద్యార్థి చరణ్‌తో ఉపాధ్యాయులు

రొద్దం: జాతీయ స్థాయి అండర్–17 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టులో రొద్దం మండలం తురకలాపట్నంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి చరణ చోటు దక్కించుకున్నాడు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్‌ఎం శివరాం, పీఈటీ రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిథ్యం వహించిన చరణ్... అద్భుత ప్రతిభతో సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. ఈ క్రమంలో జనవరిలో మహారాష్ట్రలోని జలగావ్‌లో జరిగే జాతీయ స్థాయిలో పోటీలకు అర్హత సాధించిన చరణ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

ధర్మవరం అర్బన్: వ్యక్తిగత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై కట్టెతో దాడి చేసిన ఘటన ధర్మవరంలోని ప్రియాంకనగర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని పీఆర్‌టీ వీధిలో ఉన్న సిల్క్ హౌస్ గుమస్తా సత్యదీప్... మంగళవారం రాత్రి ప్రియాంకనగర్‌లో వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన ప్రశాంత్ కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. స్వల్ప గాయాలైన సత్యదీప్‌ను కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఉత్కంఠ భరితంగా బధిరుల క్రికెట్ టోర్నీ



క్రికెట్ మ్యాచ్ జరుగుతున్న దృశ్యం

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ స్టేడియం వేదికగా సాగుతున్న బధిరుల జాతీయ స్థాయి అండర్–19 క్రికెట్ టోర్నీ రెండో రోజు ఉత్కంఠగా సాగింది. డెఫ్ ఢిల్లీ, డెఫ్ ఉత్తరప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. అనంతరం బరిలో దిగిన యూపీ జట్టు 15.5 ఓవర్లలోనే 169 పరుగులు చేసి విజయం సాధించింది. అలాగే డెఫ్ మధ్యప్రదేశ్, డెఫ్ హర్యానా మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన డెఫ్ మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. అనంతరం హర్యానా జట్టు 122 పరుగులు సాధించి విజయకేతనం ఎగురవేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును హర్యానాకు చెందిన విజయ్ అందుకున్నారు. డెఫ్ ఒడిశా, డెఫ్ ఏపీ జట్ల మధ్య ఏకపక్ష పోరు సాగింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒడిశా జట్టు 133 పరుగులు సాధించింది. అనంతరం బరిలో దిగిన ఏపీ జట్టు 8.5 ఓవర్ల వద్ద 42 పరుగులకు కుప్పకూలింది. ఒడిశాకు చెందిన నితీస్ బెహారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. టోర్నీని ఐడీసీఏ సెక్రెటరీ అజయ్, స్పోర్ట్స్ అకాడమీ మేనేజర్ శ్రీదేవి, డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కె.గోపీనాథ్, సత్యనారాయణరెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

డైయాలసిస్..!



ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఆంజనేయులు. అనంతపురం రూరల్ పరిధిలోని కొడిమి నివాసి అయిన ఇతను కొన్నేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో వారంలో మూడు సార్లు దయాలసిస్ చేయించుకోవాల్సి ఉంది. ఆంజనేయులు గతంలో 108 వాహనంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆస్పత్రికి వచ్చేవాడు. అయితే, కూటమి సర్కారు ఇటీవల వాహనాలను నిలిపివేయడంతో కుమారుడితో కలిసి బైకులో అవస్థలు పడుతూ రావాల్సి వస్తోంది. ఆంజనేయులు ఒక్కరే కాదు రవాణా సౌకర్యం లేక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వందల మంది రోగులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు.



నరకయాతన అనుభవిస్తున్న డయాలసిస్ బాధితులు

- ఆస్పత్రికి వచ్చేందుకు అందుబాటులో లేని 108 వాహనాలు
- సొంత ఖర్చులతో రాలేక అవసోపాలు
- డయాలసిస్‌కు ఒక రోజు ఆలస్యమైనా తీవ్ర సమస్యలు
- సర్కారు నిర్వాకంతో ఇప్పటికే నలుగురి మృతి!
- పట్టించుకునే వారు లేక బాధితుల ఆక్రందన

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ముందుచూపు లేకుండా కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయం కిడ్నీ రోగులకు మృత్యుపాశంగా మారింది. గడిచిన ఐదేళ్లూ ఎంతో భరోసాతో ఉన్న వారు నేడు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్యలను ఆలకించే వారు కరువై కిడ్నీ బాధితులు, వారి కుటుంబీకులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.

గతంలో ఇంటి వద్దకే అంబులెన్స్..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 543 మంది దయాలసిస్ చేయించుకుంటున్నారు. వీరిలో కొంతమంది 3 రోజులకోసారి, వారానికోసారి, నెలకు రెండు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. ఇందుకోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల రోగులు అనంతపురం నగరానికే రావాల్సి ఉంటుంది. గతంలో 108 అంబులెన్సుల్లో వచ్చి డయాలసిస్ చేయించుకుని తిరిగి అదే వాహనంలో ఇంటికెళ్లేవారు. అయితే కూటమి ప్రభుత్వం నిర్వాకం కారణంగా అంబులెన్సులను నేడు డయాలసిస్ బాధితుల సౌకర్యార్థం పంపించడం లేదు. 25 రోజులుగా వాహనాలు రావడం లేదని బాధితులు అంటున్నారు. డయాలసిస్ ఒక్క రోజు ఆలస్యమైనా తీవ్ర అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. ఈ క్రమంలో వ్యయప్రయాసలకోర్చి నగరానికి రాలేక శ్రీ సత్యసాయి జిల్లాలో ఇద్దరు, అనంతపురం జిల్లాలో ఇద్దరు రోగులు తీవ్ర అస్వస్థతతో మృతి చెందినట్టు తెలిసింది.

కక్షగట్టి..

సీఎంగా చంద్రబాబు పగ్గాలు చేపట్టాక 108 పథకానికి పెద్ద గండం వచ్చి పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజునుంచే వాహనాలపై శీతకన్నేశారు. నిర్వహణకు నిధులు విడుదల చేయడం లేదు. దీంతో వాహనాలు మరమ్మతులకు గురవడం, డీజిల్‌కు కూడా డబ్బుల్లేక ఎక్కడపడితే అక్కడ ఆగిపోతున్నాయి. 2019–24 మధ్య కాలంలో అప్పటి వైఎస్ జగన్ సర్కారు మండలానికి రెండు వాహనాలు ఏర్పాటు చేసి ప్రతి పేషెంటుకు వెన్నుదన్నుగా నిలిచింది. అలాంటి పథకం నేడు కొడిగట్టిన దీపంలా మారడం కిడ్నీ బాధితులకు శాపంగా మారింది. ఇటీవల అత్యవసర కేసులకు కూడా సకాలంలో వాహనాలు రావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు మేలు చేస్తున్న పథకాలను కూడా కక్ష సాధింపు ధోరణితో నిలిపివేయడంపై ఉమ్మడి జిల్లావాసులు తీవ్రంగా మండిపడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో దయాలసిస్ బాధితులు	543
డయాలసిస్ చేసే ఆస్పత్రులు	05
డయాలసిస్ మెషీన్లు	56
రోజుకు డయాలసిస్ చేసే సంఖ్య (సెషన్స్)	140
ఉమ్మడి జిల్లాలో అంబులెన్సులు	66
బేసిక్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	54
అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వాహనాలు	10
మూలన పడ్డ వాహనాలు	20 వరకూ

చాలా భయమేస్తోంది



కొన్నేళ్లుగా నా భర్త చిరంజీవికి డయాలసిస్ చేయిస్తున్నాం. గతంలో 108 ద్వారా ఆస్పత్రికి తీసుకువచ్చేవాళ్లం. ఇప్పుడు వాహనం రావడం లేదు. వారంలో మూడు రోజుల సర్వజనాస్పత్రికి రావాలి. వచ్చినప్పుడల్లా రూ.300 వరకు ఖర్చవుతోంది. ఆటోలో వస్తున్న సమయంలో నా భర్త ఒక్కోసారి అస్వస్థతకు గురవుతున్నారు. ఎప్పుడు ఏమవుతుందోనని భయమేస్తోంది. ఉచిత రవాణా సౌకర్యం కల్పించి పేదోళ్లను ఆదుకోవాలి. – లీలావతి, వడ్డిపల్లి, ఆత్మకూరు మండలం

రూ.500 ఖర్చవుతోంది



మా తమ్ముడు సత్యనారాయణ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతనికి భార్య లేదు. ఇద్దరు పిల్లలు చదువుకునేందుకు వెళ్తుంటారు. డయాలసిస్ కావాల్సినప్పుడల్లా నేనే తీసుకురావాల్సి వస్తోంది. రూ.500 వరకు ఖర్చు చేసుకుని తీసుకొస్తున్నా. మాలాంటి పేదోళ్ల ప్రతి సారి రూ.వందలు ఖర్చు చేసుకోవడం చాలా భారమైన పని. డయాలసిస్ చేయించుకుని తీసుకెళ్లేలోపు నా తమ్ముడు నరకయాతన అనుభవిస్తున్నాడు. – జయలక్ష్మి, ధర్మబిక్షం కాలనీ, అక్కంపల్లి

వివాహిత ఆత్మహత్య

గుడిబండ: మండలంలోని దాసరపల్లికి చెందిన వివాహిత శిల్ప (32) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. భర్త చంద్రతో కలసి వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్న శిల్పకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెకు కుటుంబసభ్యులు చికిత్స చేయించినా ఫలితం దక్కలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె సోమవారం రాత్రి కడుపు నొప్పి తాళలేక అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున భర్త నిద్ర లేచేసరికి శిల్ప కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో గాలింపు చేపట్టి వ్యవసాయ బావిలో తేలియాడుతున్న శిల్ప మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లి సాకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటకలో హత్య.. పెనుకొండలో మకాం

పెనుకొండ: కర్ణాటకలో ఓ వ్యక్తిని హత్య చేసి పోలీసులు కళ్లు గప్పి కుటుంబంతో సహా పెనుకొండకు మకాం మార్చిన నిందితుడిని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. వివరాలు... కర్ణాటకలోని హవేరి పట్టణానికి చెందని బాబ్జాన్, ఆయన భార్య కొన్ని నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని హతమార్చారు. అనంతరం పోలీసుల కళ్లు గప్పి భార్యాపిల్లలతో కలసి పెనుకొండలోని దర్గాపేటలో అద్దె ఇంట్లోకి మకాం మార్చాడు. హత్య ఘటనపై కేసు నమోదు చేసిన హవేరి పోలీసులు బాబ్జాన్ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే పెనుకొండకు మకాం మార్చినట్లు గుర్తించిన హవేరి పోలీసులు మంగళవారం తెల్లవారుజామున ఇక్కడకు చేరుకున్నారు. నిందితుడి ఫోన్ నంబర్ కాల్ లిస్ట్ ఆధారంగా ఆరా తీస్తూ పోయారు. ఈ క్రమంలో సోమందేపల్లి మండలం చల్లాపల్లికి చెందిన ఓ డీలర్ తనకు ఇటీవల సదరు నంబర్ నుంచి కాల్ వచ్చిందని, స్టోర్ బియ్యం దింపినట్లుగా అవతలి వ్యక్తి తనకు సమాచారం అందించాడని వివరించడంతో స్థానిక పోలీసుల సాయంతో మఫ్టీలో పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న స్టాక్ పాయింట్ వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. అయితే తమ కళ్లెదుటే నిందితుడు తిరుగుతున్నా పోలీసులు గుర్తు పట్టలేకపోయారు. అక్కడే ఉన్న కొందరు హమాలీలు ఇతనే బాబ్జాన్ అని తెలపడంతో వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాబ్జాన్ నివాసముంటున్న ఇంటి వద్దకెళ్లి భార్యతో పాటు ఇతర కుటుంబసభ్యులనూ అదుపులోకి తీసుకుని హవేరీకి బయలుదేరి వెళ్లారు.

హక్కులు కాలరాస్తే సహించం

- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ధ్వజమెత్తిన కార్మికులు, కర్షకులు



పుట్టపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: కార్మిక, కర్షక హక్కులను కాలరాస్తే సహించబోమంటూ కార్మికులు, రైతులు మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడుతూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, అనుబంధ సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో కదం తొక్కారు. గణేష్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకూ ఎర్రజెండాలతో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వేమయ్యయాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు బాలకాశి, తదితరులు మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ సర్కార్ గతంలో రద్దు చేస్తామని చెప్పిన నల్లచట్టాలను మళ్లీ అమల్లోకి తీసుకావాలని ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను లేబర్ కోడ్ పేరుతో నాలుగు చట్టాలు చేసి, పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేపట్టారంటూ ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉవ్విళ్లూరుతున్నాయన్నారు.

చిరుద్యోగులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, రూ.26 వేల జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు వీడకపోతే ప్రజాగ్రహాన్ని చవి చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్, నాయకులు మహదేవ్, ఇంతియాజ్, ఈఎస్ వెంకటేష్, పెద్దన్న, పైపల్లి గంగాధర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కణేకల్లు: మండలంలోని బెణికల్లు గ్రామానికి చెందిన బోయ రామాంజినేయులు (40) ఆత్మహత్య చేసుకున్నాడు. మనస్పర్థల కారణంగా తన భార్య ఈరమ్మతో సోమవారం రాత్రి గొడవ పడిన ఆయన తీవ్రమనోవేదనకు లోనై మంగళవారం వేకువజామున ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.



పుట్టపర్తిని కమ్మేసిన మంచు దుప్పటి



మొక్కలపై మంచు బిందువులు

హిమ సోయగం...

శీతాకాలం.. వాయుగుండం.. అల్పపీడనం... తుపాను ప్రభావం .. కారణాలు ఏవైనా... కరువు కాటకాలకు నిలయమైన జిల్లాలో హిమపాతం కనువిందు చేస్తోంది. చుట్టూ కొండలున్న పుట్టపర్తి ప్రాంతం ఊటీ... కొడైకెనాల్ ప్రాంతాలను మరిపిస్తోంది. సాయంత్రం నుంచి మరుసటి రోజు ఉదయం వరకూ ఏకధాటిగా కురుస్తున్న మంచు కారణంగా చలి తీవ్రత పెరిగింది. ప్రకృతి సోయగాలు పర్యాటకులను ఆహ్లాదపరుస్తున్నాయి.

పుట్టపర్తి రూరల్:



రాత్రి 7 గంటల సమయంలో కురుస్తున్న మంచు



పంట పొలాలపై కమ్ముకున్న మంచు

అటకెక్కిన చదువులు

- 10 రోజులుగా గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె
- క్రీడలతో కాలక్షేపం చేస్తున్న విద్యార్థులు
- పది రోజులుగా ఇదే పరిస్థితి

ఉరవకొండ: ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలల్లో పాఠాలు బోధించే ఉపాధ్యాయులు లేక విద్యార్థుల చదువులు అటకెక్కాయి. గత పదేళ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయినా ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ నెల 16 నుంచి సమ్మె బాట పట్టారు. ఫలితంగా గిరిజన గురుకులాల్లో బోధన పూర్తిగా నిలిచిపోయింది. దీంతో తమకు తోచిన క్రీడలతో విద్యార్థులు రోజంతా కాలక్షేపం చేస్తున్నారు.

డిమాండ్లు న్యాయపరమైనవే...

ఎన్నికల సమయంలో కూటమి పెద్దలు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారంటూ ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు నిరుద్యోగులకు భృతి చెల్లిస్తామంటూ నాడు ఇచ్చిన హామీని నెరవేర్చక పోగా అన్యాయంగా తమను తొలగించే కుట్రలకు తెరలేపారంటూ మండి పడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 1,143 ఔట్ సోర్సింగ్ పోస్టులను డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపించరాదని, 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలని, ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న తమను కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లుగా గుర్తించాలని, రెగ్యూలర్ ఉద్యోగులతో సమానంగా అన్నీ సౌకర్యాలు కల్పించాలంటూ తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే డిమాండ్లను నెరవేర్చకుండా కూటమి సర్కార్ మొండి చెయ్యి చూపడంతో టీచర్లు సమ్మెలోకి వెళ్లారు. దీంతో పది రోజులుగా గిరిజన గురుకులాల్లో విద్యాబోధన అటకెక్కింది.



ఆటల్లో నిమగ్నమైన తనకల్లులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు



రాగులపాడు గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పాఠాలు బోధిస్తున్న జూనియర్ అసిస్టెంట్ ముత్యాలప్ప

సమ్మెలోకి 110 మంది

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 12 ప్రభుత్వ గిరిజన పాఠశాలలు ఉన్నాయి. గోరంట్ల, పెనుకొండ, కదిరి, తనకల్లు, అనంతపురం, ఉరవకొండలో గిరిజన బాలికల పాఠశాలలతో పాటు కదిరి, బుక్కరాయసముద్రం, రాగులపాడు, కళ్యాణదుర్గం, గొల్లలదొడ్డిలో బాలుర పాఠశాలలు, తనకల్లులో కాలేజ్ ఆఫ్ ఎక్స్ ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 3 నుంచి 10వ తరగతి వరకు 1,417 మంది బాలబాలికలు ఉండగా, శ్రీసత్యసాయి జిల్లాలో 1,430 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. కేవలం ప్రిన్సిపాల్ ఒక్కరే రెగ్యూలర్ పద్ధతిలో మిగిలిన 110 మంది ఉపాధ్యాయులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఇందులో తెలుగు, హిందీ, ఇంగ్లిషు, గణితం, సైన్స్, సోషల్‌తో పాటు పీఈటీలూ ఉన్నారు. వీరంతా 2016లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కింద నియమితులైన వారే. ప్రారంభంలో రూ.3వేల వేతనం అందిపుచ్చుకున్న వీరు ప్రస్తుతం రూ.12వేల వేతనానికి చేరుకున్నారు. సమ్మె కారణంగా 10వతరగతి విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సిలబస్ పూర్తికాక పోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు

ఉపాధ్యాయుల సమ్మె వల్ల గురుకులాల్లో విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా దగ్గర్లోని ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్నాం. కొన్ని పాఠశాలల్లో ప్రిన్సిపాళ్ల ద్వారానే పాఠ్యాంశాలు బోధించేలా చర్యలు తీసుకున్నాం.
– రామాంజినేయులు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, అనంతపురం

ఉద్యోగాలు తొలగించడం దారుణం

తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు భృతిని అందించడంతో పాటు కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీనిచ్చారు. అధికారం చేపట్టిన తర్వాత అన్ని వర్గాలనూ మోసం చేశారు. పదేళ్లుగా ఔట్ సోర్సింగ్ పద్ధతిలో గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను తొలగించేందుకు కుట్ర చేయడం సరైంది కాదు. వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చి గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చూడాలి.
– శివశంకర్‌నాయక్, జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె

మా డిమాండ్లన్నీ న్యాయపరమైనవే. ఉద్యోగ భద్రతతో పాటు 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. మా డిమాండ్లన్నీ నెరవేరేవరకూ సమ్మెలోనే ఉంటాం.
– లోకన్న, ఉపాధ్యాయుడు, గిరిజన బాలుర పాఠశాల, గొల్లలదొడ్డి, గుత్తి మండలం